www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 217, సోమవారం 7-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వెల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు లో విఫలం



3లో..

శ్రీకృష్ణాష్టమి ఉట్టి పండుగలో డాక్టర్ భట్టు వెంకన్నకు అరుదైన గౌరవం



4వ పేజీల్లో

## ఈశ్వర్ సాయి వ్యవహారం.. మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం

**జానపద కళాకారిణి మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం**

**న్యాయం జరగడం లేదనే మనస్తాపంతో ఈ తీవ్ర నిర్ణయం**

**గాయకుడు ఈశ్వర్ సాయిపై గతంలో పోలీసులకు ఫిర్యాదు**

**పరారీలో ఈశ్వర్ సాయి.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్**

**మాధురిపై ఈశ్వర్ సాయి భార్య కూడా పోలీసులకు ఫిర్యాదు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 6:**

ప్రముఖ జానపద కళాకారిణి మాధురి రాథోడ్ ఆత్మహత్యకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. మరో జానపద గాయకుడు ఈశ్వర్ సాయిపై తాను చేసిన ఫిర్యాదు విషయంలో న్యాయం జరగడం లేదన్న తీవ్ర మనస్తాపంతో ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా, కుటుంబసభ్యులు సకాలంలో గమనించి, తలుపులు పగలగొట్టి ఆమెను రక్షించారు.

ఈశ్వర్ సాయి తనను పెళ్లి పేరుతో మోసం చేసి, శారీరకంగా వాడుకుని, ఆ తర్వాత వేధించాడని మాధురి రాథోడ్ గతంలోనే హైదరాబాద్‌లోని నర్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా, ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ వీడియోలు సృష్టించి తన పరువుకు భంగం కలిగించాడని ఆమె తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈశ్వర్ సాయిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 69 కింద కేసు నమోదు చేశారు. అయితే, అతను పరారీలో ఉన్నాడని పోలీసులు ..మిగతా 2లో



## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన

# డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్

**ఓటమి ఖాయం కావడంతో దోపిడీ చేస్తున్న కాంగ్రెస్**

**పాలను చేతకాక బూతు పురాణం చదువుతున్న రేవంత్**

**అసెంబ్లీలో తన గురించే ఎక్కువ మాట్లాడతారు, పట్టించుకోవద్దు**

**ఎర్రవల్లిలో శాసనసభాపక్ష సమావేశం**

**బిఆర్ఎస్ కార్యాచరణపై కెసిఆర్ దిశానిర్దేశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 6**

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. కేసీఆర్ అధ్యక్షతన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆ పార్టీ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ నేతలతో ఆయన చర్చించారు. బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారు తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందన్న కేసీఆర్, అందువల్లనే అడ్డగోలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పాలన చేతకాకే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా బూతుపురాణం చేస్తున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని నిలదీశారు. తన చావు కోరుతూ పదేపదే స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా, గోదావరి నది జలాల అంశంపై ఉధృతమైన పోరాటం చేయాలని బీఆర్ఎస్ ..మిగతా 2లో



## 2040 వరకు తెలంగాణలో

# కాంగ్రెస్‌దే అధికారం

**కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన మధ్య తేడాపై చర్చకు సిద్ధమన్న మహేశ్ గౌడ్**

**కేటీఆర్ సోషల్ మీడియాలో క్షణికానందం పొందుతున్నారని ఎద్దేవా**

**తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క వాడిపోయిందని వ్యాఖ్య**

**హైదరాబాద్, సెప్టెంబర్ 6 :**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడిన ఆయన, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కేసీఆర్ ..మిగతా 2లో



## తెలంగాణలో 369

# ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు

**టెండర్లకు టీజీ రెడ్కో ఆహ్వానం**

**200 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు**

**టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో 169 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లకు టెండర్లు -**

**ఆరు క్లస్టర్లలో 200 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 6 :**

తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత పెంచడంతో చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లను (సీపీఓలు) ఆహ్వానిస్తూ టెండర్ల ప్రకటనను జారీ చేసింది. తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వాటికి ..మిగతా 2లో

## 2029 నాటికి డ్రగ్స్ రహిత

# భారతదేశమే లక్ష్యం

**డ్రగ్స్ రహిత భారత్‌తోనే**

**'వికసిత్ భారత్' కల సాకారం: అమిత్ షా**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6:**

డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు.

"2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు ..మిగతా 2లో

## దిశానిర్దేశం కోల్పోయిన

# బీఆర్ఎస్ నాయకత్వం

**ధర్నాలు మాని అసెంబ్లీకి రండి**

**సమాధానం చెప్పేందుకు మేం సిద్ధం: శ్రీధర్‌బాబు**

**బీఆర్ఎస్ నాయకత్వం దిశానిర్దేశం కోల్పోయిందన్న శ్రీధర్ బాబు**

**ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని వెల్లడి**

**బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 6 :**

తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయ కత్వం పూర్తిగా దిశానిర్దేశం కోల్పోయి పక్కదారి పడుతోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. రోడ్లపై అనవసర ధర్నాలు, మీడియా ముందు మాట్లాడటం మాని నేరుగా అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తాము ప్రతీదానికీ సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వలేకపోయారని, కానీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ..మిగతా 2లో



# తెలంగాణలో 369 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు



**మొదటి పేజీ తరువాయి...**

అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న విద్యుత్తు వాహనాల మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రణాళిక చేసింది. దీర్ఘకాలికంగా, వాణిజ్యపరంగా నిలకడైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే టీజీ రెడ్కో ముఖ్య లక్ష్యం అని రెడ్కో ఎండీ ముషారఫ్ ఫారూఖీ పేర్కొన్నారు.

10 సంవత్సరాలపాటు కాంట్రాక్ట్ : హైదరాబాద్ పరిధిలోని జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీఓలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లో 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని చూస్తున్నామని రెడ్కో ఎండీ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు.

టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 : ఎంపికైన సీపీఓలు సర్వే, డిజైన్, సరఫరా, సివిల్ వర్క్స్, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, కమిషనింగ్‌తో పాటు 10 సంవత్సరాల పాటు ఆపరేషన్, మెయింటెనెన్స్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పీఎం ఈ డ్రైవ్ పథకంలో భాగంగా అర్హులైన బిడ్డర్‌కు నిబంధనలకు లోబడి సబ్సిడీ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (+టా అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రూ.169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీ-బిడ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ ఈనెల 08 నుంచి ప్రారంభమై 22న ముగుస్తుందని అన్నారు. టెండర్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్



**మొదటి పేజీ తరువాయి...**

సభ్యులకు కేసీఆర్ తెలిపారు. ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల దగ్గరకు వెళ్దామని, నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందని అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని ఆదేశించారు. సమావేశంలో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని పేర్కొన్నారు.అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని, శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ఉభయసభల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలని వెల్లడించారు.

**నీళ్ల కోసం త్వరలో పాదయాత్ర చేస్తా**

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశంలో కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లానంటూ ప్రకటించారు. త్వరలోనే తాను స్వయంగా కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను సందర్శించనున్నట్లుగా బీఆర్ఎల్పీలో ప్రకటించారు. కేవలం కొద్ది మంది నేతలతో కాకుండా, ఏకంగా లక్ష మందితో కలిసి ఆ రెండు ప్రాజెక్టులను సందర్శిస్తానానని వెల్లడించారు. అంతేకాకుండా, రాష్ట్రంలో సాగునీటి సంక్షోభం, ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై ప్రజలను చైతన్యపరిచేందుకు నీళ్ల కోసం త్వరలోనే భారీ పాదయాత్ర కూడా చేపడతానని ప్రకటించారు. ఇక రేపటి నుంచి ప్రారంభం రాబోయే అసెంబ్లీ సమావేశాలను సమర్ధవంతంగా ఎదుర్కొంటూనే, మరోవైపు ప్రజాక్షేత్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణను తీవ్రతరం చేయాలని కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.

# 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు.

పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ

2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌లను (ఏఎన్‌టీఎఫ్) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్‌ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు.

"మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్, పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్‌లైన్‌ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్‌ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో




పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. "తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ (మావోయిస్టు) కారిడార్' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్-మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు. 2019 జులై నుంచి 2026 జులై మధ్య కాలంతో 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్ నేరస్థులను భారతదేశానికి తిరిగి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.



## జాతీయస్థాయి కరాటే పోటీలలో కొత్తకోట విద్యార్థుల ప్రతిభ

**కొత్తకోట, సెప్టెంబర్ 6:**

ఈనెల 5, 6 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కేంద్రంలో పుష్పరాజ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన 13వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో కొత్తకోట కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీలు జీకే ఎం ఏ ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 2000 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు ఈ పోటీలకు కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ చెందిన విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు చక్కటి ప్రతిభ కనబరిచి బంగారు వెండి పథకాలు సాధించారు వీరిలో కథ విభాగంలో అండర్ 8 సంవత్సరాల బాలికల విభాగంలో రుహయ్య బంగారు పతకం అండర్ 9 సంవత్సరావిభాగంలో విభాగంలో వి వైష్ణవి వెండి పతకం అండర్ 10 సంవత్సరాల అబ్బాయిల విభాగంలో ప్రజమన్ రాజ్ వెండి పతకం, రాహుల్ బంగారు పతకం సాధించి చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రకాలను అందించడం జరిగిందని వీరికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ జాఫర్ సాదిక్ ని వారు ప్రత్యేకంగా అభినందించారు. క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఇన్చార్జ్ కె మహేష్ పాల్గొన్నారు.



డాక్టర్ చల్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రముఖులు

## డాక్టర్ చల్మారెడ్డి సేవలు ఎనలేనివి

### డాక్టర్ ఎం ఎస్ వి చల్మారెడ్డి ఆశయాలను స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలి వక్తలు

**వనపర్తి , సెప్టెంబర్ 6:**

వనపర్తి పట్టణ కేంద్రంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చల్మా రెడ్డి చేసిన సేవలు మరువలేని అని వక్తలు కొనియాడారు. ఆదివారం పట్టణ కేంద్రంలో గల లక్ష్మీ కృష్ణ గార్డెన్ లో ఏర్పాటు చేసిన డాక్టర్ చల్మా రెడ్డి దశదిన కార్యక్రమానికి పలువురు హాజరై ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ జి చిన్నారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు భారతీయత పార్టీ సీనియర్ నాయకులు మున్నూరు రవీందర్ , బిజెపి సీనియర్ నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ , కొత్తకోట మండల నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీకి చెందిన బి కృష్ణ , శంకర్, లత పాటు అనేక పరివార క్షేత్రాల నుంచి విశ్వహిందూ పరిషత్ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొని డాక్టర్ చల్మా రెడ్డి సేవలను గుర్తు చేశారు.

## ఈశ్వర్ సాయి వ్యవహారం.. మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం

**మొదటి పేజీ తరువాయి...**

చెబుతుండగా, అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఈశ్వర్ సాయి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం.

పోలీసులు ఈశ్వర్ సాయిని అరెస్ట్ చేయకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, తనకు న్యాయం జరగడం లేదనే ఆవేదనతోనే మాధురి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు.

ఇదే వ్యవహారంలో మరో కోణం కూడా ఉంది. ఈశ్వర్ సాయి భార్య శరణ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్ స్టేషన్‌లో మాధురిపై ఫిర్యాదు చేశారు. ఒక హోటల్‌లో ఉన్న ఈశ్వర్ సాయి, మాధురి వద్దకు తాను వెళ్లగా, తనపై దాడి చేసి ఐఫోన్ లాక్కున్నట్టు ఆమె ఆరోపించారు. ఈ ఘటనపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. మొత్తం మీద మాధురి ఫిర్యాదు, శరణ్య ఫిర్యాదులపై పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే ఈ వివాదంలోని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

## 2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

**మొదటి పేజీ తరువాయి...**

చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బీజేపీ అనే మొక్క అసలు మొలకెత్తనే మొలకెత్తదని ఆయన ఎద్దేవా చేశారు.

## దిశానిర్దేశం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకత్వం

**మొదటి పేజీ తరువాయి...**

మహిళల ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని బీఆర్ఎస్, బీజేపీ నేతల కుటుంబ సభ్యులు కూడా వినియోగించుకోవడం లేదా? అని శ్రీధర్‌బాబు నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు కావాలనే కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నాయని, ఈ దుష్ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొడతారని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు.

# హామీలిచ్చి చేతులెత్తేశారు.. కాంగ్రెస్‌కు బాకీ కార్డులతో బీఆర్ఎస్ షాక్!

- 100 రోజుల్లో అమలు చేస్తామన్న 6 గ్యారంటీలు ఏవీ..? 1000 రోజులు దాటినా హామీల జాడేది?
- చర్ల సంతలో 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ.. హామీలు నెరవేర్చే వరకు పోరాటం: బీఆర్ఎస్





**చర్ల, సెప్టెంబర్ 6:**
**, సెప్టెంబర్ 6 (భద్రాద్రి న్యూస్) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చర్ల సంతలో ప్రజలకు 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఐదో రోజు చర్ల సంతలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ మాట్లాడుతూ.. 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, 1000 రోజులు దాటుతున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. చర్ల సంతలో ప్రజల నుంచి వచ్చిన స్పందన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని ఆయన అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, హామీల అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున మరింత ఉధృతంగా పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 6 గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల పక్షాన నిరంతర ఆందోళనలు కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.డి. అజీజ్, ఎడ్ల రామదాసు, యువజన నాయకులు అంబోజి సతీష్, మెంతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండప కర్రపూజ కార్యక్రమం



**ఖమ్మం , సెప్టెంబర్ 6 (భద్రాద్రి న్యూస్):** స్థానిక 36వ డివిజన్ రజక వీధి నందు గల శ్రీ బాల ఉషోదయ యూత్ కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం 10 గంటలకు కర్ర పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా ప్రముఖ న్యాయవాది కొత్త వెంకటేశ్వరరావు , మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాల్లో కర్ర పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు కర్రను శక్తి, రక్షణకు ప్రత్యేకంగా భావించి పూజించటం ఆనవాయితీగా ఉంటుందని ఈ కార్యక్రమం ద్వారా వినాయకుని ఆశీస్సులు పొంది మండపానికి మరియు పట్టణ ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని వారు భగవంతుని ప్రార్థించారు. అలాగే యువతలో ఐక్యత భక్తి, భావం మరియు సాంప్రదాయాల పట్ల గౌరవం కలిగి ఉండాలని వారు కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో డివిజన్ సెక్రెటరీ పిల్లుట్ల కృష్ణ మరియు కమిటీ సభ్యులు ధనకొండ సత్యనారాయణ,తాళ్లూరి మల్లికార్జున్, తాళ్లూరి కళ్యాణ్, కుమ్మరికుంట్ల వంశీ, తాళ్లూరి ఉపేందర్, గంధం సాయిరాం, మామిడాల శివ సాయి, పిట్టల చరణ్, ఏనుగంటి ఈశ్వర్, వందనపు లోకేష్, వందనపు రాకేష్, . తాళ్లూరి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల ఏకైక గురువుకు సత్కారం

- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



**ఇల్లందు టౌన్ ,సెప్టెంబర్ 6 (భద్రాద్రిన్యూస్ ):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహాసభ మరియు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మార్గదర్శిని స్కూల్‌లో ఆర్యవైశ్య ప్రముఖులు, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్యవైశ్యుల ఏకైక గురువుగా సేవలందిస్తున్న శ్రీ అర్వపల్లి రాధాకృష్ణ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు పాబోలు మణికిరణ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడంతో పాటు సమాజానికి మంచి పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా అర్వపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయుడిగా అందిస్తున్న సేవలు, ఆర్యవైశ్య సమాజానికి చేస్తున్న మార్గదర్శకత్వం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్రను గుర్తించి వారిని సత్కరించుకోవడం ఎంతో గర్వకారణమని పట్టణ అధ్యక్షులు అనుబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు పాబోలు మణికిరణ్ , పట్టణ అధ్యక్షులు నరేంద్రుల అనుబాబు , వాసవి క్లబ్ అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్ , వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య , వాసవి క్లబ్ జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్ , వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ ఎ-106గా జాయింట్ సెక్రెటరీ జొన్నల ఉపేందర్ నాథ్ గుప్తా , వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి తీర్దాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం ఆర్యవైశ్య సమాజంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు లో విఫలం

- -కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామాల్లో చర్చ జరగాలి
- -కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- -కేసీఆర్ పదేళ్ల పాలనలోనే పల్లెలు, పట్టణాల అభివృద్ధి
- -కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో పల్లెల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది మాజీ మంత్రి పువ్వాడ అజయ్ మాజీ ఎంపీ నామ





**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:** వైరా అసెంబ్లీ నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలం లో కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనలో పల్లెల విధ్వంసం, పడకేసిన పారిశుద్ధ్యంపై నిరసన కార్యక్రమ ర్యాలీ లో బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్జెసి కృష్ణ, లకావత్ గిరిబాబు ఆధ్వర్యంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లోఏర్పాటు చేసిన కార్యక్రమం లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలసి మాజీ ఎంపీ నామ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా నామ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు లేనిపోని మాయమాటలు, మోసపూరిత హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని నామ నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. ?కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల ముందు మహిళలకు, యువతకు, విద్యార్థులకు, రైతులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ పూర్తిగా నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో రైతు సంక్షేమం కోసం లక్ష కోట్లు ఖర్చు చేశారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రైతు భీమా పథకాలను అమలు చేయడం లో విఫలమైందని విమర్శించారు కనీసం రైతులకు ఎరువులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. అన్ని రకాల పెన్షనులు పెంచి అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజులు గడుస్తున్నా ఆ హామీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో ఆడబిడ్డలకు అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని అన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో పారిశుధ్యం కోసం నాడు కేసీఆర్ హయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని కానీ కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో పల్లెల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని తెలియజేశారు.

**-కేసీఆర్ పాలన సువర్ణ యుగం**

రాష్ట్ర ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాంతం లో తాగు, సాగునీటి కష్టాలు ఉండేవని వాటితో పాటుగా తీవ్ర విద్యుత్ సంక్షోభం ఉండేదని మాజీ ఎంపీ నామ గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తరువాత కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ పల్లెలు, పట్టణాలు ఎంతో అభివృద్ధి చెందాయని ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలు, 24 గంటలు విద్యుత్, సాగునీరు, తాగునీరు అందించారని అ ఘనత ఒక్క కేసీఆర్ కే దక్కుతుందని తెలిపారు.

**- ఖమ్మం జిల్లా అభివృద్ధి బిఆర్ఎస్ హయాంలోనే**

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరం మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై ప్రతి డివిజన్ ప్రతి వీధి తిరిగి ప్రజల సమస్యలు పరిష్కారం చేసిన నాయకుడు అజయ్ కుమార్ అన్నారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ఖమ్మం అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టారని, ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొంటామని, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడతామని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి పై ముగ్గురు మంత్రులతో చర్చకు సిద్ధం అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి,డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మనీషా లక్ష్మి మదన్ లాల్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకునే ఆపన్నహస్తం.. పద్మశాలి సంఘం మానవత్వం!

- బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో యువతి.. చికిత్స ఖర్చులకు రూ.41 వేల ఆర్థిక చేయూత
- కష్టకాలంలో కుటుంబానికి భరోసాగా నిలిచిన సంఘ సభ్యులు.. ఫండ్ రైజింగ్‌తో మానవత్వం చాటింపు



**చర్ల, సెప్టెంబర్ 6 (భద్రాద్రి న్యూస్):** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వానికి మారుపేరుగా నిలిచింది పద్మశాలి సంఘం. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే తమ బాధ్యతగా భావిస్తూ మరోసారి తమ సేవా దృక్పథాన్ని చాటుకుంది. చర్ల గణేశ్‌నగర్‌కు చెందిన ఫోటో స్టూడియో నిర్వాహకుడు, న్యూస్ రిపోర్టర్ బొల్లె సందీప్ భార్య బొల్లె దీపిక (23) బ్లడ్ ఇన్ఫెక్షన్ కారణంగా పలు ఆరోగ్య సమస్యలకు గురై భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే వైద్య ఖర్చులు భారీగా పెరగడంతో కుటుంబంపై ఆర్థిక భారం పడింది. ఇటీవలే ప్రేమ వివాహం చేసుకున్న ఈ కుటుంబం ఒకవైపు సంసార బాధ్యతలు, మరోవైపు భార్య చికిత్స ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని తెలుసుకున్న పద్మశాలి సంఘం సభ్యులు వెంటనే స్పందించారు. "ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఒంటరిగా వదిలేది లేదు" అనే సంకల్పంతో సంఘ సభ్యులు ఫండ్ రైజింగ్ చేపట్టి ఆర్థిక సహాయం సేకరించారు. ఈ క్రమంలో సేకరించిన రూ.41,000 నగదును శనివారం ఉదయం 10 గంటలకు శెశెట్టి సాంభ శివరావు చేతుల మీదుగా బొల్లె సందీప్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘ కార్యవర్గ సభ్యులు లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ.. ఎవరైనా ఏ సమయంలోనైనా ఆపదలో ఉన్నట్లు సమాచారం అందితే, వారి కష్టాన్ని తమ కష్టంగా భావించి ఆదుకునేందుకు పద్మశాలి సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలవడం సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సంఘం నుంచి సహాయం పొందిన వారు భవిష్యత్తులో తమకు సాధ్యమైనంత మేర ఇతర ఆపదలో ఉన్నవారికి చేయూత అందించాలని పిలుపునిచ్చారు. "ఒక్క కుటుంబం కష్టాల్లో ఉన్నా.. సమాజం మొత్తం అండగా నిలవాలి" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. పరస్పర సహకారం, మానవత్వంతోనే సమాజంలో ఆపదలో ఉన్న వారికి నిజమైన భరోసా కల్పించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్ని కృష్ణమోహన్, చింతా నాగుబాబు, దొడ్డి తాతారావు, బండారు భరణి, దొడ్డి సూరిబాబు, వలుస లింగమూర్తి, ఇర్సవడ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం చదువుకు అడ్డుకాకూడదు..

- గిరిజన విద్యార్థుల భవిష్యత్‌కు చేయూతనిద్దాం!
- విద్యార్థులే రేపటి వెలుగులు.. వారికి అండగా దాతలు ముందుకు రావాలి
- చదువే ఆయుధంగా ముందుకు సాగండి.. ఉత్తమ ప్రవర్తనతో ఉన్నతులు కండి: ఎడారి గణపతి



**చర్ల, సెప్టెంబర్ 6 (భద్రాద్రి న్యూస్) :** చదువులకు దూరమవుతున్న గిరిజన విద్యార్థులకు విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రముఖ వ్యాపారి ఎడారి గణపతి పిలుపునిచ్చారు. తన కుమార్తె దివంగత ఎడారి వెంకట కావ్య జ్ఞాపకార్థం చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయానికి 75 కేజీల బియ్యాన్ని అందించడంతో పాటు విద్యార్థులకు ఒకపూట భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎడారి గణపతి మాట్లాడుతూ.. గిరిజనుల వికాసం కోసం వనవాసీ సంస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్రవర్తనతో ఉన్నతులుగా ఎదిగి, సంస్థ పేరు ప్రతిష్ఠలను మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల చదువులో తన వంతు భాగస్వామ్యం కల్పించుకోవడం సంతోషంగా ఉందని గణపతి తెలిపారు. తనలాంటి దాతలు మరింత మంది ముందుకు వచ్చి విద్యార్థులకు చేయూతనందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. **విద్యతోపాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ:** వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు విద్య, వైద్య సౌకర్యాలను అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసీ విద్యార్థులను అక్కున చేర్చుకొని, వారికి విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను అందిస్తున్నట్లు వివరించారు. కొమరం భీం విద్యార్థుల ప్రతిభా పాటవాలకు ఆకర్షితులై అనేకమంది దాతలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఎడారి గణపతి వంటి దాతలు విద్యార్థులకు వితరణ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరింత శ్రద్ధతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

**పలువురు పాల్గొనగా..:** ఈ కార్యక్రమంలో ఎడారి లక్ష్మణ్‌రావు, వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, కొమరం భీం విద్యార్థి నిలయ అధ్యక్షుడు తాటి పాపారావు, ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్‌బాబు, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, నిలయ ప్రముఖులు వరలక్ష్మి, సంతోష్, సహ నిలయ ప్రముఖ్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో గురు వైభవం

- విద్యార్థులు ఉపాధ్యాయులై.. గురువులు విద్యార్థులై.. సందడిగా వేడుకలు





**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 5 (భద్రాద్రిన్యూస్ ):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువుల సేవలను స్మరించుకుంటూ, గురు--శిష్య బంధంలోని ఆత్మీయతను చాటేలా వినూత్న కార్యక్రమాలను నిర్వహించారు.

వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయులు విద్యార్థులుగా మారి ప్రేయర్ కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలను పోషిస్తూ ప్రేయర్, అసెంబ్లీ కార్యక్రమాలను నిర్వహించగా, ఉపాధ్యాయులు విద్యార్థుల పాత్రలో పాల్గొని సందడి చేశారు. ఈ వినూత్న కార్యక్రమం అందరినీ ఆకట్టుకోవడంతో పాటు గురువు బాధ్యతలు, విద్యార్థుల భావాలను పరస్పరం అర్థం చేసుకునేలా చేసింది. అనంతరం భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. దేశ విద్యారంగానికి ఆయన అందించిన సేవలను, ఉపాధ్యాయ వృత్తికి ఆయన కల్పించిన గౌరవాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాలను బోధించే వ్యక్తి మాత్రమే కాదని, విద్యార్థుల ఆలోచనలకు దిశానిర్దేశం చేస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శి అని అన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడమే ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయులు విద్యార్థులుగా మారిన కార్యక్రమం ఎంతో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఉపాధ్యాయుల బాధ్యతలను, ఉపాధ్యాయులు విద్యార్థుల భావాలను మరింతగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. గురువు--విద్యార్థి మధ్య పరస్పర గౌరవం, అవగాహన, ఆత్మీయత మరింత బలపడినప్పుడే విద్యకు సంపూర్ణత చేకూరుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. అలాగే పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు కీలక పాత్ర పోషిస్తున్న నాన్-టీచింగ్ స్టాఫ్‌ను కూడా పండ్లు, పూలతో ఆత్మీయంగా గౌరవించారు. పాఠశాల విజయానికి ప్రతి ఒక్కరి సేవలు విలువైనవేనని పేర్కొంటూ, వారి కృషిని అభినందించారు. విద్యార్థులు తమ గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం గురువుల పట్ల గౌరవం, అభిమానం, ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

www.bhadradrinews.com
# భద్రాద్రి న్యూస్
Bhadradrinews Telugu Daily
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
సోమవారం
7 । సెప్టెంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

## సైన్స్ వేదికపై త్రివేణి 'స్పార్క్'

**– విద్యుత్ వాహనాల నాటికతో జిల్లా స్థాయిలో మెరుపు**



**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబరు 6 (భద్రాద్రిన్యూస్):** ఖమ్మం సైన్స్ మ్యూజియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో త్రివేణి టాలెంట్ స్కూల్, ఖమ్మం శాఖ విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. జిల్లాలోని 8 మండలాల నుంచి 38 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో 'సైన్స్--సమాజం' ఇతివృత్తంగా పోటీలు నిర్వహించారు. త్రివేణి విద్యార్థులు 'విద్యుత్ వాహనాలు--భవిష్యత్తు వైపు ముందడుగు' అంశంపై 'విద్యుత్ వాహనాలు' నాటికను ప్రదర్శించి, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర రవాణా ఆవశ్యకతను సందేశాత్మకంగా చాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ విద్యార్థులను అభినందించారు. పాఠశాల సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం తో ట్రైల్ రన్ నిర్వహించి తుమ్మల చెరువు కు గోదావరి జలాలు

**– విడుదల చేసిన శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు.**





**అశ్వాపురం, సెప్టెంబర్06(భద్రాద్రి న్యూస్):** అశ్వాపురం మండలంలో 25 కోట్లతో నిర్మించిన మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి ట్రైల్ రన్ నిర్వహించి తుమ్మలచెరువు కు గోదావరి జలాలు విడుదల చేసిన శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అశ్వాపురం రైతుల చిరకాల ఆకాంక్ష సాకారం తుమ్మల చెరువు రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక అడుగు తుమ్మల చెరువు రైతుల చిరకాల సాగునీటి కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడింది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ, కృషితో చేపట్టిన మారెళ్లపాడు లెఫ్ట్ కెనాల్ ట్రయల్ రన్ విజయవంతమైంది. దీంతో తుమ్మల చెరువు ఆయకట్టు రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.గోదావరి జలాలను తుమ్మల చెరువుకు తరలించి రైతులకు సాగునీరు అందించాలన్నది ఈ ప్రాంత రైతుల ఏళ్ల తరబడి ఉన్న చిరకాల కోరిక. ఈ కోరికను నెరవేర్చేందుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరంతరం కృషి చేస్తూ, అధికారులతో సమన్వయం చేస్తూ ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం మారెళ్లపాడు లెఫ్ట్ కెనాల్‌కు ట్రయల్ రన్ నిర్వహించగా, ట్రయల్ రన్ విజయవంతం కావడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు ఈ విజయాన్ని పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. ఎన్నో ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న తమకు ఈ రోజు ఎంతో సంతోషకరమైన రోజని రైతులు పేర్కొన్నారు."గోదావరి జలాలు మా పొలాలకు చేరి పచ్చని పంటలు పండితే అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. మా చిరకాల కోరిక నెరవేరే దిశగా ట్రయల్ రన్ సక్సెస్ కావడం రైతులందరికీ పండుగ రోజు" అంటూ రైతులు ఆనందం వ్యక్తం చేశారు.మారెళ్లపాడు లెఫ్ట్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరడంతో ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి కష్టాలు గణనీయంగా తగ్గనున్నాయి. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు, పంటలకు భరోసా లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మధిర అభివృద్ధికి రూ.47 కోట్ల భారీ నిధులు

**– మడుపల్లి రోడ్డు, ఏటి బ్రిడ్జికి రూ.26 కోట్లు..**
**సిరిపురం--మెట్టగుట్ట డబుల్ రోడ్డుకు రూ.21 కోట్లు**
**– జీవో విడుదల.. భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు**



మధిర: మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధిర నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి నిధుల వివరాలను వెల్లడించారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ సెంటర్ నుంచి శివాలయం మీదుగా ఏటి మీద బ్రిడ్జి నిర్మాణంతో మడుపల్లి వరకు రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు రూ.26 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు.

## హైదరాబాద్ లో జరగనున్న అండర్ 16 క్రికెట్ మ్యాచ్ కు ఎంపికైన మణుగూరు క్రీడాకారులు



**మణుగూరు, సెప్టెంబర్ 06 (భద్రాద్రి న్యూస్ ):** హైదరాబాద్‌లో జరగనున్న అండర్-16 క్రికెట్ మ్యాచ్‌లకు మణుగూరులోని ఎలైట్ క్రికెట్ అకాడమీ నుంచి ఇద్దరు ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంపికయ్యారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న టీ.జీ.టీ. కౌశిక్, ఎస్.వీ. మోక్షిత్ వర్మలు సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో జరగనున్న అండర్-16 మ్యాచ్‌కు ఎంపికయ్యారు.ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 7న సాయంత్రం హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో నివేదించాల్సిందిగా ఖమ్మం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెకూరి వెంకట్ తెలిపారు.ఎలైట్ క్రికెట్ అకాడమీ నుంచి ఇద్దరు క్రీడాకారులు అండర్-16 స్థాయి మ్యాచ్‌కు ఎంపిక కావడం పట్ల అకాడమీ ప్రధాన కోచ్ డేవిడ్ రిచర్డ్స్ హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి



పోటీల్లో రాణించి మణుగూరు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఇద్దరు క్రీడాకారుల ఎంపికతో అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇతర క్రీడాకారుల్లోనూ నూతన ఉత్సాహం నెలకొంది. మణుగూరు ప్రాంతం నుంచి అండర్-16 స్థాయి క్రికెట్ పోటీలకు ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమాజ నిర్మాణంలో గురువులదే కీలకపాత్ర

**-- ఉత్తమ పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ లోకం**
**--తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలి**
**--గురువులకు పూర్వ వైభవం తీసుకుని వచ్చే బాధ్యత సమాజంపై ఉంది**
**--జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్**
**- వేడుకగా గురుపూజోత్సవ సన్మానోత్సవాలు**














**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 6 (భద్రాద్రిన్యూస్):** సమాజ నిర్మాణంలో గురువులదే కీలకపాత్రని , ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత గురువులపైనే ఉందని జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పి రామోజీ రమేష్ తెలిపారు. స్థానిక జోయాలుకాస్ సంస్థలో ఆదివారం జరిగిన గురుపూజోత్సవ సన్మానోత్సవ కార్యక్రమానికి ఎస్పి రామోజీ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయులను, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. జోయాలుకాస్ మేనేజర్ సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సన్మానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎస్పి రామోజీ రమేష్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణ గురువులతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమాజంలో వివిధ రంగాలలో ఉన్నతంగా ఎదిగిన వ్యక్తులందరూ గురువుల మార్గదర్శకంలోనే ఉన్నత స్థితికి చేరారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు దుష్ప్రవర్తనకు లోనైనప్పుడు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల గురువుల పట్ల అనుచిత వైఖరి పెరుగుతున్న సందర్భాలు ఉంటున్నాయని తల్లితండ్రులు , సామాజిక సంస్థలు గురువులకు పూర్వ వైభవం తీసుకొని రావడానికి బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. ముదిగొండ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ఆచార్యులు అయినాల సైదులు మాట్లాడుతూ ఆధునిక ఏఐ యుగంలోనూ గురువులు చూపిన మార్గమే శిరోధార్యం అని తెలిపారు. మాజీ సైనిక ఉద్యోగి ఎస్ ఎం అరుణ్ మాట్లాడుతూ బుద్ధుడు , వర్ధమానుడు , ఏసుక్రీస్తు, అబ్దుల్ కలాం , పూలే, సావిత్రిబాయి , అంబేద్కర్ తదితరులు గురువులుగా సమాజ చైతన్యానికి దోహదపడ్డారని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త మంత్రి ప్రగడ శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి అయినా తరగతి గదిలో ఉపాధ్యాయుడు నేర్పిన చదివు ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలిపారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలో గురువులకు పూర్వ వైభవం యధాతథ స్థితి కొనసాగుతుందని తెలిపారు. న్యూ విజన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండి అబాద్ అలీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వారిని సన్మార్గంలో పెట్టడంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రిటైర్డ్ ఆచార్యులు కోయ నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు అత్యంత బాధ్యతతో పిల్లలకు దిశా నిర్దేశం చేసినప్పుడే పిల్లలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని దీనికి తమ కుమారుడు కోయ శ్రీహర్ష కలెక్టర్ కావడమే ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ ఓలేటి సాంబమూర్తి మాట్లాడుతూ గురువులపై అన్ని విధాలుగా ప్రస్తుతం మరింత బాధ్యత పెరిగిందని తల్లితండ్రులు గురువులకు తమ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ స్కూల్ హెడ్మాస్టర్ చల్లగాని కృపాబాలానందం, వివిసి స్కూల్ మాధవి, సంభాని నగర్ స్కూల్ సూర్య కుమారి, డాక్టర్ ఆయేషా, గురుకుల లెక్చరర్ విమల, రిటైర్డ్ టీచర్ కొత్తపల్లి గురుప్రసాద్, గీతాంజలి స్కూల్ జానీ, రెజోనెన్స్ స్కూల్ జ్ఞానం సంతోష్, లెక్చరర్లు వడిగా రాజకుమార్, జార్జ్ , రత్న విశాల్, తదితరులు పాల్గొన్నారు. సభలో 25 మంది గురువులను శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ వేడుకలను జోయాలుకాస్ మేనేజర్ సంతోష్, గురుకుల ఆచార్యులు అయినాల సైదులు , మాజీ సైనిక ఉద్యోగి ఎస్ ఎం అరుణ్ లు పర్యవేక్షించారు.

## TAIKA ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-- 2026లో అబ్దుల్ నుమాన్ సత్తా





**పాల్వంచ, ( భద్రాద్రి న్యూస్) సెప్టెంబర్ 06:** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో సెప్టెంబర్ 6న నిర్వహించిన TAIKA ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో పాల్వంచకు చెందిన యువ కరాటే క్రీడాకారుడు అబ్దుల్ నుమాన్ అద్భుత ప్రతిభ కనబరిచి పలు విజయాలు సాధించాడు. నవోదయ కరాటే ఇన్స్టిట్యూట్, పాల్వంచకు చెందిన బ్రౌన్ బెల్ట్ క్రీడాకారుడు అబ్దుల్ నుమాన్, మాస్టర్ ఏ. రాంబాబు ఆధ్వర్యంలో ఈ పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నాడు.ఈ ఛాంపియన్‌షిప్‌లో అబ్దుల్ నుమాన్ కటా విభాగంలో కాంస్య పతకం, కుమితి విభాగంలో బంగారు పతకం సాధించడంతో పాటు, తన అద్భుతమైన పోరాట ప్రతిభకు గుర్తింపుగా "బెస్ట్ ఫైటర్" అవార్డును కూడా అందుకున్నాడు. ఒకే ఛాంపియన్‌షిప్‌లో బంగారు, కాంస్య పతకాలతో పాటు బెస్ట్ ఫైటర్ అవార్డు సాధించడం పట్ల నవోదయ కరాటే ఇన్స్టిట్యూట్ మాస్టర్ ఏ. రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. అబ్దుల్ నుమాన్ క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఈ స్థాయికి ఎదిగాడని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అబ్దుల్ నుమాన్ సాధించిన ఈ విజయం పాల్వంచతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చే గర్వకారణమైన విజయమని పలువురు క్రీడాభిమానులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు. విజేత అబ్దుల్ నుమాన్‌కు, శిక్షణ అందిస్తున్న మాస్టర్ ఏ. రాంబాబుకు పలువురు అభినందనలు తెలియజేశారు.

## ఎం ఫార్మసీ విద్యార్థినికి ఆర్ఐ జానకిరామ్ రెడ్డి 50వేల ఆర్థిక సహాయం



**కోదాడ, సెప్టెంబర్ 6(భద్రాద్రి న్యూస్):** ఎం ఫార్మసీ చదువుతున్న కోదాడ పట్టణం నయానగర్ కు చెందిన మరింగంటి ఆనంద కు మేళ్లచెరువు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామిడి జానకి రామ్ రెడ్డి 50వేల రూపాయలను కళాశాల ఫీజుల కోసం ఆర్థిక సహాయం చేశారు. హైదరాబాదులో ఎం ఫార్మసీ చదువుకుంటున్న మరింగంటి ఆనంద కు ఉన్నత విద్యాభ్యాసానికి జానకిరామ్ రెడ్డి వెన్నుదన్నుగా నిలిచారు. పురోహితుడుగా పనిచేస్తున్న లక్ష్మణాచార్యుల కుమార్తె ఆనంద కు కళాశాల ఫీజుల అవసరాన్ని గుర్తించిన ఆర్ ఐ జానకి రామ్ రెడ్డి మానవత్వంతో పెద్ద మనసుతో ఆలోచించి ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. చదువుల్లో ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ ఉన్నత లక్ష్యసాధన కోసం చదువులు కొనసాగిస్తున్న ఆనందకు ఇకముందు కూడా తాను ఆర్థికంగా అండగా నిలుస్తానని ఆర్ ఐ జానకి రామ్ రెడ్డి తెలియజేశారు. ఇప్పటివరకు ఆర్ఐ జానకిరామ్ రెడ్డి పలువురు విద్యార్థులకు వేల రూపాయలలో చదువుల కోసం ఆర్థిక సహాయం చేశారు. విద్యా ,సామాజిక సేవలలో జానకి రామ్ రెడ్డి చూపుతున్న చొరవకు అందరి చేత ప్రశంసలు అందుకుంటున్నారు.

## అభిమానుల సందడి మధ్య ఘనంగా ముివ్వా విజయబాబు జన్మదిన వేడుకలు



**దమ్మపేట సెప్టెంబర్ 6 భద్రాద్రి న్యూస్ :** దమ్మపేట మండల కేంద్రంలో ముివ్వా విజయబాబు జన్మదిన వేడుకలను రొయ్యల కుమార్, జెమీదర్ బంజర సర్పంచ్ ఈశ్వరప్రగడ నాగభూషణం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విజయబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్, మండల సీనియర్ నాయకులు చిన్నంశెట్టి యుగంధర్, దిశా కమిటీ సభ్యురాలు సొంగ యేసుమని, కార్యకర్తలు అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## వైరా లో శ్రీ చరిత డెంటల్ హాస్పిటల్ ప్రారంభం

– డెంటల్ హాస్పిటల్ ను ప్రారంభించిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ,



**వైరా, సెప్టెంబరు 6,( భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణంలో నూతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన శ్రీ చరిత డెంటల్ హాస్పిటల్ ను ఆదివారం వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ నేటి సమాజంలో అత్యాధునిక పరికరాలతో, నూతన టెక్నాలజీతో డెంటల్ హాస్పిటల్ ప్రారంభించటం అభినందనీయమని, హాస్పిటల్ నిర్వాహకులు పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించి ప్రజల మన్ననలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ నిర్వాహకులు లగడపాటి ప్రభాకర్ రావు, లగడపాటి శ్రీ చరిత, డాక్టర్ కోట అవినాష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు , బుర్ర రాజశేఖర్, లైన్స్ క్లబ్ ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా వురిమళ్ళ ఫౌండేషన్ పురస్కారాల పండుగ

**- ప్రముఖ కవి రచయిత చిమ్మపూడి శ్రీరామ మూర్తికి**
**- భోగోజు సముద్రమ్మ -పురుషోత్తం స్మారక పురస్కార ప్రదానం**
**- కథల కవితల సంకలనం ఆవిష్కరణ**







**వైరా, సెప్టెంబర్ 6 (భద్రాద్రి న్యూస్ ) :** వురిమళ్ళ ఫౌండేషన్ 8వ వార్షికోత్సవం సంబరాలు ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన పురస్కారాల పండుగ వైభవంగా వేడుకగా జరిగింది. తొలుత భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం, వురిమళ్ళ శ్రీరాములు, పద్మజ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాసరోజు శ్రీనివాస్ అధ్యక్షతన కథలు, కవితల పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం స్మారక పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త చిమ్మపూడి శ్రీరావుమూర్తికి వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు అందచేశారు. అనంతరం కథల పుస్తకాన్ని నామా పురుషోత్తం పరిచయం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు, ప్రముఖ కవి, విమర్శకులు ప్రసేన్ మాట్లాడుతూ నిర్విఘ్నంగా సాహిత్య సేవ చేయడం ప్రశంసనీయ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కథలు కవితలు పోటీలు నిర్వహించి నగదు బహుమతి ఇవ్వడమే కాకుండా వారి రచనలను పుస్తకంగా తీసుకరావడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా బాల సాహిత్యాన్ని ప్రోత్సాహిస్తూ విద్యార్థుల రచనలు పుస్తకంగా తీసుకువచ్చి వారిచేత ఆవిష్కరించడం గొప్ప విషయం అన్నారు. కాళోజి అవార్డు గ్రహీత సీతారాం, ప్రముఖ రచయిత్రి కొండపల్లి నిహారిణీ, బాలసాహితి వేత్త మధుసూదన్ రాజు, ఎస్‌వి యూనివర్సిటీకి చెందిన బ్రహ్మానందరెడ్డి, ప్రముఖ సామాజిక వేత్త పారుపల్లి ఝాన్సీ, సామాజిక చైతన్య వేదిక సుమతి తదితరులు సభనుద్దేశించి మాట్లాడుతూ వురిమళ్ల ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం కథల, కవితల విజేతలకు నగదు పురస్కారాలు అందచేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కవులు స్పందన తెలిపారు. సభ ప్రారంభానికి ముందు తన గళంతో కవి, గాయకుడు, ప్రముఖ జర్నలిస్ట్ మోదుగు గోవిందరావు పాడిన పాట శ్రోతులను ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో అక్షరాలతోవ నిర్వాహకులు నామా పురుషోత్తం రాచమ ళ్ల ఉపేందర్ ఖమ్మం సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణాష్టమి ఉట్టి పండుగలో డాక్టర్ భట్టు వెంకన్నకు అరుదైన గౌరవం

**-- 5,000 కీర్తనలు రచించిన డాక్టర్ భట్టు వెంకన్నకు వేలాది భక్తుల సమక్షంలో చిన్న జీయర్ స్వామీజీ ప్రశంసలు**
**--"మరో అన్నమయ్యగా భక్తి సంకీర్తనల ద్వారా సేవ"అంటూ అభినందనలు**







**కామేపల్లి,సెప్టెంబర్ 6(భద్రాద్రి న్యూస్):** శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉట్టి పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహంతో ఘనంగా జరిగాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామీజీ కరుణా కటాక్షంతో డాక్టర్ భట్టు వెంకన్నకు అపూర్వమైన ఆనందాన్ని, ఆత్మీయతను కలిగించింది. భక్తి, సేవ, సంకీర్తనల ద్వారా సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించిన చిన్న జీయర్ స్వామీజీ, 5,000కు పైగా కీర్తనలు రచించిన డాక్టర్ భట్టు వెంకన్నను వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రత్యేకంగా ప్రశంసించారు. భక్తి సంకీర్తనల ద్వారా ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న ఆయన సేవలను అభినందిస్తూ,'మరో అన్నమయ్య'గా కొనియాడినట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉట్టి పండుగలో విజయం సాధించిన భక్తులకు డాక్టర్ భట్టు వెంకన్న చేతుల మీదుగా స్వయంగా బహుమతులు అందించే అరుదైన అవకాశాన్ని చిన్న జీయర్ స్వామీజీ కల్పించారు. తన సేవలను గుర్తించి, వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రశంసించడంతో పాటు బహుమతులు అందించే అవకాశం కల్పించడం తన జీవితంలో మరచిపోలేని మహాభాగ్యమని డాక్టర్ భట్టు వెంకన్న విజయ శంకర స్వామీజీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయ శంకర స్వామీజీ కూడా పలువురు భక్తులకు శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామీజీ వారి మంగళాశాసనాలతో బహుమతులు అందజేశారు. భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సేవాభావాలను చాటిచెప్పిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పెద్దలు,పండితులు, ఆధ్యాత్మికవేత్తలు, నిర్వాహకులు, వందలాది మంది విద్యార్థులు,వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుని బాలలీలలను స్మరించుకుంటూ నిర్వహించిన ఉట్టి పండుగ భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది. భక్తి కార్యక్రమాలతో పాటు సేవా భావాన్ని ప్రోత్సహించడం, యువతను సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి వైపు నడిపించడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "ఈ మహాభాగ్యం జీవితాంతం పవిత్ర జ్ఞాపకమే"స్వామీజీ వారి కరుణా ధారలో లభించిన ఈ మహాభాగ్యాన్ని నా జీవితాంతం ఒక పవిత్రమైన జ్ఞాపకంగా హృదయంలో పదిలపరచుకుంటాను" అని డాక్టర్ భట్టు వెంకన్న ఆదివారం తెలిపారు. చిన్న జీయర్ స్వామీజీ వారి ఆశీస్సులు, మంగళాశాస నాలు తన భవిష్యత్ సేవా కార్యక్రమాలకు మరింత ప్రేరణనిస్తాయని, భక్తి సంకీర్తనలు, సామాజిక సేవ ద్వారా ప్రజలకు మరింతగా సేవ చేయడమే తన సంకల్పమని ఆయన పేర్కొన్నారు. భక్తి మార్గంలో మరో అడుగు... సంకీర్తన సేవలో మరో అధ్యాయం... చిన్న జీయర్ స్వామీజీ వారి ఆశీస్సులతో డాక్టర్ భట్టు వెంకన్న సేవా ప్రయాణం మరింత ముందుకు సాగుతోంది. వారు అన్నారు.

# బండారు దత్తాత్రేయకు మర్యాదపూర్వకంగా కలిసి ఘన సన్మానం

**- బంజారా యువతకు బీజేపీలో రాజకీయ అవకాశాలు కల్పించాలి**
**- మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ టీపీసీ మెంబర్ డాక్టర్ భట్టు నాగేశ్వరరావు**





**కామేపల్లి,సెప్టెంబర్ 6 (భద్రాద్రి న్యూస్):** హర్యానా, హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకులు బండారు దత్తాత్రేయ ను మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ ఆధ్వర్యంలో టీపీసీ సభ్యులు,బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ భట్టు నాగేశ్వరరావు నేతృత్వంలోని బృందం ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించింది. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా గౌరవించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో బీజేపీ కోసం చురుగ్గా, నిబద్ధతతో పనిచేస్తున్న బంజారా యువతకు పార్టీలో తగిన రాజకీయ అవకాశాలు కల్పించాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బంజారా యువత ప్రతిభకు, ప్రజాసేవ పట్ల వారి అంకితభావానికి గుర్తింపు ఇస్తూ, అర్హత నిబద్ధత కలిగిన యువ నాయకత్వానికి సముచిత రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డాక్టర్ భట్టు నాగేశ్వరరావు బండారు దత్తాత్రేయ కు విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న బంజారా యువతకు రాజకీయ అవకాశాలు లభిస్తే, వారి శక్తి ప్రజాసేవకు మరింత బలంగా ఉపయోగపడుతుంది అని ఆయన పేర్కొన్నారు బంజారా యువతను రాజకీయంగా ప్రోత్సహించి,పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో మరింత బాధ్యతలు అప్పగించాల్సిన అవసరాన్ని దత్తాత్రేయ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజ్ఞప్తిపై బండారు దత్తాత్రేయ సానుకూలంగా స్పందిస్తూ,బంజారా సమాజానికి చెందిన అర్హత,ప్రతిభ, నిబద్ధత కలిగిన యువతకు పార్టీలో మరిన్ని అవకాశాలు లభించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన సానుకూల స్పందన పట్ల డాక్టర్ భట్టు నాగేశ్వరరావు, బృంద సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, రానున్న ఎన్నికలు, బంజారా యువత రాజకీయాల్లో పోషించాల్సిన పాత్ర తదితర అంశాలపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, డాక్టర్ భట్టు నాగేశ్వరరావు, ఏఐబీఎస్‌ఎస్ తెలంగాణ రాష్ట్ర మీడియా సెక్రెటరీ భీముడు నాయక్, కార్వ నాయకుడు వినయ్ దాస్, రోహిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం కార్పోరేషన్ లో పారిశుధ్యం పడకేసింది

**- సీజనల్ వ్యాధులు రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలి**
**- కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ నాయకురాలు కాపు సీతాలక్ష్మి**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 06 (భద్రాద్రి న్యూస్) :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ నాయకురాలు కాపు సీతాలక్ష్మి విమర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. ఆదివారం 15వ డివిజన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు, రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్త, తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలపై ప్రజలు తమ ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా వార్డుల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ, కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని విమర్శించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో ప్రజలు దుర్వాసన, దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఆమె పేర్కొన్నారు. స్వచ్ఛ ట్రాలీలను ఏర్పాటు చేసి చెత్త సేకరణకు చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి ఇంటికీ డస్ట్‌బిన్లు పంపిణీ చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ వ్యవస్థను సక్రమంగా వినియోగించకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోందని మండిపడ్డారు. వర్షాకాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్, యాంటీ లార్వా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు పనిచేయని వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వాటి అమలులో ప్రజలకు నిరాశే మిగిలిందని కాపు సీతాలక్ష్మి విమర్శించారు. మహిళలను నమ్మించి మోసం చేశారని ఆరోపిస్తూ.. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పెన్షన్ల పెంపు విషయంలోనూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమపాళ్లలో అమలు చేశామని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ప్రాథమిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో చోటుచేసుకున్న వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తాళ్లగూడెంలో ముత్యాలమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు



**కామేపల్లి,సెప్టెంబర్ 6(భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండలం పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా,ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి వేడుకలను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లకావత్ సునీత మంగీలాల్,ఉప సర్పంచ్ శెట్టి శ్రీనివాసరావు,వార్డు సభ్యులు పుచ్చకాయల చిన్న వెంకటేశ్వర్లు,శెట్టి మాధవి ప్రియ, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమోతు వెంకట నరసయ్య,మాజీ ఎంపిటిసి నల్లమోతు లక్ష్మయ్యలతో పాటు గ్రామ పెద్దలు, నాయకులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు

# బడీ వీడు పిల్లల భవిష్యత్తే దైవం

## -- 36 ఏళ్ల విద్యాసేవకు అంకితం అత్యున్నత పురస్కారం



**కామేపల్లి, సెప్టెంబరు 6(భద్రాద్రి న్యూస్):** గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయుడికి తగిన గౌరవం దక్కింది. సుదీర్ఘ 36 ఏళ్ల విద్యా ప్రస్థానంలో ఎన్నో సవాళ్లను అధిగమించి, నిరంతర విద్యాసేవలందించిన కామేపల్లి మండలానికి చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు సపావట్ కిషన్ ప్రతిష్ఠాత్మక లితెలంగాణ రాష్ట్ర "ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు"లికు ఎంపికయ్యారు.

**గడ్డి ఇంటి నుంచి అవార్డు స్థాయికి..**

నాడు లకావత్ పింకోడి ఇల్లు,ఒక చిన్న గడ్డి ఇంటి నుంచి ప్రారంభమైన ఆయన పాఠశాల ప్రయాణం.. కీర్తిశేషులు ఎస్.కె. మహబూబ్ ఉపాధ్యాయుడు పాఠశాల, యూపీఎస్ తాళ్లగూడెం బడి మీదుగా సాగింది. 2000వ సంవత్సరంలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలు పెంచడమే లక్ష్యంగా శ్రమించారు. ఐటీడీఏ అధికారుల ప్రోత్సాహంతో అనేక వినూత్న విద్యా ప్రణాళికలు రూపొందించి, అమలు చేశారు. గ్రామం నుంచి కొడంగల్ వరకు సాగిన ఈ ప్రయాణంలో నిత్యం పిల్లల భవిష్యత్తు కోసమే పరితపించారు.

**నా వెనుక ఉన్నది ప్రజాభిమానమే:**

ఈ విశిష్ట పురస్కారం లభించడంపై కిషన్ టీచర్ సంతోషం వ్యక్తం చేశారు."నా జీవితంలో ఇదొక మరచిపోలేని మైలురాయి. ఈ అవార్డు గౌరవం నా ఒక్కడిదే కాదు.. నాకు వెన్నుదన్నుగా నిలిచిన నా తల్లిదండ్రులు, టేకుల తండా, సూర్య తండా, తాళ్లగూడెం, కామేపల్లి మండల ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, శ్రేయోభిలాషులందరిదీ" అని స్పష్టం చేశారు. తనకు నేరుగా,ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన వైఫల్యాలపై బిఆర్ఎస్ పోరుకు సిద్ధం

**-- నేడే ఛలో కామేపల్లి 'ప్రజావాణి'లో వినతి పత్రం అందజేత**
**-- మండల కేంద్రంలో తహసిల్దార్ మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా**





**కామేపల్లి,సెప్టెంబర్ 6 (భద్రాద్రి న్యూస్):-** తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేక విధానాలను చిప్పిగొట్టేందుకు ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ పోరుకు సిద్ధం కావాలని కార్యకర్తలకు ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ మాజీ మండల అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య అన్నారు కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు,ఇతర హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ బిఆర్ఎస్ పార్టీ సోమవారం మండల కేంద్రంలో నిరసన కా ర్య క్ర వ మా ని కి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రేపు ఉదయం 10:30 గంటలకు కామేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయం నందు ధర్నా మండల పరిషత్ కార్యాలయం లో జరిగే 'ప్రజావాణి'లో వినతి పత్రం సమర్పించనున్నట్లు మాజీ మండల అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య విలేకరులతో మాట్లాడుతూ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన ర్యాలీ ముట్టడి ధర్నా కార్యక్రమంలో ఇల్లందు నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే నియోజవర్గం ఇన్చార్జ్.బానోత్ హరిప్రియ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. మండలంలోని పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు అభిమానులు అనుబంధ సంఘాల నాయకులు మహిళలు ఉదయం 10:00 గంటల కు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు.

# భక్త రామదాసు కళాక్షేత్రంలో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు



**కామేపల్లి,సెప్టెంబర్ 6(భద్రాద్రి న్యూస్):** ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలం పరిధిలో గల కొత్త లింగాల గ్రామం యందు ఉన్న శ్రీ సాయి వివేకా భారతి ప్రైవేట్ స్కూల్ యజమాన్యం దివ్వెల వెంకటేశ్వరరావు వారి సతీమణి దివ్వెల రాజ్యలక్ష్మి కిఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డును అందుకున్నరు శ్రీ సాయి వివేక భారతి స్కూల్ ఉపాధ్యాయురాలు దివ్వెల రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు ఖమ్మంలో నిర్వహించిన. కార్యక్రమంలో భక్త రామదాసు కళాక్షేత్రం యందు ఘనంగా అవార్డు ప్రధాన ఉత్సవం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం చేతుల మీదగా రాజ్యలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డును స్వీకరించారు అలాగే వారు మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దటంలో విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన విద్యను అందించడంలో తమ వంతు తను కృషి చేస్తున్నానని తెలిపారు. పేద విద్యార్థులకు తల్లితండ్రులు లేని పిల్లలకు వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారందరినీ అన్ని రంగాలలో రాణించేటట్టు క్రీడా సాంస్కృతిక కళా ప్రదర్శనలు సామాజిక కర్తవ్యం వ్యాయామము ఆటల పోటీలు ఆరోగ్యపట్ల జాగ్రత్తలు చదువుపై ప్రత్యేక సమయం కేటాయించి పోటీ పరీక్షల్లో డీటుగా రాణించే విధంగా క్రమశిక్షణగా మెలగాలని విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు తమ ఎంతో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి కి ఉత్తమ అవార్డు రావడం చాలా సంతోషకరమని విద్యార్థులు తల్లిదండ్రులు తోటి ఉపాధ్యాయులు అధికారులు నాయకులు ప్రజాప్రతినిధులు వివిధ కుల సంఘాల నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046